క్లుప్తంగా

చేనేత ప్రదర్శనకు అపూర్వ స్పందన

నెల్లూరు(మినీబైపాస్): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన చేనేత ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ చక్రధర్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28 వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో 80 స్టాళ్లను నెలకొల్పారన్నారు. బిహార్, జమ్మూకశ్మీర్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో పాటు వెంకటగిరి, ధర్మవరం, పాటూరు, ఉప్పాడ, తదితర వస్త్రాలు ఆకర్షిస్తున్నాయన్నారు.

బంగారు లాకెట్ బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి దాతలు ఆదివారం బంగారు లాకెట్‌ను బహూకరించారు. కావలికి చెందిన సూరిబోయిన శ్రీధర్‌రెడ్డి, మమత దంపతులు అమ్మవారికి 9 గ్రాముల బంగారు లాకెట్‌ను అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



ఇందుకూరుపేట: పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన, తదితర మతాలకు సంబంధించిన ప్రార్థనలు జరిపారు. తొలుత ఆశ్రమంలోని గాంధీజీ, స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు మంజుల, సర్పంచ్ సుధాకర్, మేనేజర్ సాయిమనోజ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముత్తుకూరు: ముత్తుకూరు–నెల్లూరు ప్ర ధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో ముగ్గురు వ్య క్తులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు..నెల్లూరు నుంచి ముత్తుకూరు వైపు ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై బయలుదేరారు. మరో వ్యక్తి ముత్తుకూరు నుంచి నెల్లూరు వైపు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. లింగాయపాళెం కూడలి సమీపంలో ఎదురెదురుగా రెండు మోటార్‌సైకిళ్లు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వీరిలో గోపాలపురానికి చెందిన ఏడుకొండలు తీవ్రంగా గాయపడగా 108 వైద్యసిబ్బంది వెంటనే చింతారెడ్డిపాళెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన మిగిలిన ఇద్దరు వ్యక్తులు బైక్‌లపై వెళ్లిపోయారు.

క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వ కృషి



పొదలకూరు : రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైస్‌ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తోడేరు పంచాయతీ శాంతినగర్‌కు చెందిన పాస్టర్ లక్కు స్వరాజ్‌కు ఆదివారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సన్మాన కార్యక్రమానికి వైస్ ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆశీస్సులతో మంచి మనిషి స్వరాజ్‌కు జిల్లాస్థాయి పదవి లభించడం సంతోషకరమన్నారు. క్రిస్టియన్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం సన్మాన గ్రహీత మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని, మంత్రి కాకాణికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పూకోటి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, తోడేరు మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్‌రెడ్డి , విశ్రాంత ఉపాధ్యాయుడు కొప్పోలు జగన్నాథరావు, ఎంపీటీసీలు జీ.శ్రీనివాసులు, స్వర్ణ సుగుణ, సభాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కొప్పోలు చలపతిరావు, రవీంద్ర, లోకేష్, యజ్ఞాని, కే.వెంకటేశ్వర్లు, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి



ఆదాల ప్రభాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమంచర్ల పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎంపీ నివాసానికి ఆదివారం చేరుకున్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డిని నేతలు వెంకటేశ్వర్లునాయుడు, రత్నయ్య సత్కరించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడారు. ఆమంచర్ల నేతలు, ప్రజలతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, పంచాయతీ పరిధిలోని ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నేతలు మస్తానయ్య, పుట్టయ్య, సుధాకర్, రఘురామయ్య, వెంకటకృష్ణయ్య, శీనయ్య, నరసయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



నెల్లూరు రూరల్: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ముగ్గురికి మంజూరైన రూ.8.2 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను తన కార్యాలయంలో అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పించడంతో పాటు విద్యాబోధన మరింత మెరుగుపడేలా చర్యలు చేపట్టారని కొనియాడారు. సీఎం సహాయనిధికి సంబంధించి పలువురికి చెక్కులు త్వరలో మంజూరు కానున్నాయని చెప్పారు.

రక్తదానంతో ప్రాణదానం

నెల్లూరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. లక్ష్యం ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుజబుజనెల్లూరులో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, డాక్టర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కవి రామకృష్ణకు పురస్కారం



నెల్లూరు(బృందావనం): ఉగాది అత్యుత్తమ కవితా పురస్కారాన్ని కవి పెరుగు రామకృష్ణ మినీబైపాస్ రోడ్డులోని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కార్యాలయం వద్ద ఆదివారం అందుకున్నారు. తంజావూరు చిత్రకారుడు రాజసింహ స్థాపించిన సింహపురి ఫైన్ ఆర్ట్స్ అకాడమీ రజతోత్సవాన్ని పురస్కరించుకొని పురస్కారాన్ని సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ అందజేశారని చెప్పారు.

అశ్లీల నృత్యాలు చేసే వారిపై చర్యలకు వినతి

నెల్లూరు(బారకాసు): ఈవెంట్స్ ద్వారా కొందరు అశ్లీల నృత్యాలు చేస్తూ కళారంగం అంటే ప్రజల్లో గౌరవం, విలువల్లేకుండా చేస్తున్నారని.. ఇలాంటి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజు కోరారు. ఈ మేరకు పలువురు డ్యాన్స్ మాస్టర్లతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. సంప్రదాయ నృత్యాలతో ఈవెంట్స్ చేసుకుంటూ 35 మంది డ్యాన్స్ మాస్టర్లు ఉన్నారని తెలిపారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో తమ అసోసియేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులను ఎస్పీ జారీ చేశారని తెలిపారు. అయితే కళాకారులు కాని కొందరు వ్యక్తులు ఇతర ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి అశ్లీల నృత్యాలను చేయిస్తున్నారని ఆరోపించారు. వీరిపై కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. డ్యాన్స్ మాస్టర్లు చిట్టిబాబు, కోదండపాణి, బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు

శ్రీనివాస్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం



నెల్లూరు (టౌన్): హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో రీసెర్చి అసోసియేట్‌గా పనిచేస్తున్న నగరంలోని డైకస్‌రోడ్డుకు చెందిన శ్రీనివాస్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. బయోటెక్నాలజీ విభాగంలో జీవ ఇంధనాలపై పరిశోధన చేసినందుకు గానూ జేఎన్టీయూ, హైదరాబాదు వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 1964 నుంచి 2005 మధ్య చదువుకున్న వారు హాజరయ్యారు. నాటి స్మృతులను నెమరేసుకొని ఉత్సాహంగా గడిపారు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ అలుమ్నీ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడిగా ప్రిన్సిపల్ సుధాకర్, గౌరవ సెక్రటరీగా సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడిగా శ్రీనాథ్, కార్యదర్శిగా ప్రభాకర్, మరో 16 మందిని ఎన్నుకున్నారు. కళాశాల అభివృద్ధికి రూ.ఐదు లక్షలను అందిస్తున్నామని శ్రీనాథ్, ప్రభాకర్ పేర్కొన్నారు.



ఎస్పీ పరామర్శ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా పోలీస్ కార్యాలయంలో బీ – సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఖతీజాబేగాన్ని ఎస్పీ విజయారావు ఆదివారం పరామర్శించారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుండటంతో పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. త్వరగా కోలుకోవాలని కాంక్షించారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఘన నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్పీ విజయారావు ఆదివారం నివాళులర్పించారు. 1998 బ్యాచ్‌కు చెందిన చంద్రశేఖర్‌రాజు సోమశిల పోలీస్‌స్టేషన్లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విధులు ముగించుకొని నగరంలోని తన ఇంటికి బైక్‌పై శనివారం వస్తుండగా, రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. ఈ క్రమంలో నగరంలోని ఆయన నివాసానికి వచ్చిన ఎస్పీ నివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. అంత్యక్రియల నిమిత్తం రూ.50 వేలను కుటుంబసభ్యులకు అందజేశారు.



అపార్ట్‌మెంట్‌లో మంటలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వేదాయపాళెం సమీపంలోని న్యూ మిలటరీ కాలనీ వద్ద గల సాయిబాబా ఆలయ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కూలింగ్ ఆయిల్ లీకవ్వడంతో మంటలు వచ్చి అపార్ట్‌మెంట్‌కు వ్యాపించాయి. గుర్తించిన అపార్ట్‌మెంట్ వాసులు వెంటనే మంటలను అదుపు చేశారు. సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని వారు పేర్కొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సంతపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా పేర్కొన్నారు. సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రౌడీషీటర్లు ఇప్పటికైనా మంచి నడవడికను అలవర్చుకోవాలని కోరారు. నిరంతర నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న అన్వర్‌బాషా

ఉగాది పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం): శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని హరివిల్లు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో పురమందిరంలో ఆదివారం నిర్వహించారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అధ్యక్షతన హరివిల్లు క్రియేషన్స్ అధినేత హరిబాబు ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన 12 మందికి పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు.

ప్రతిభగల వారికి సన్మానం ప్రశంసనీయం

వివిధ రంగాల్లో ప్రతిభను చాటే వారిని గుర్తించి సత్కరించడాన్ని సినీ నటుడు గౌతమ్‌రాజు అభినందించారు. అమరావతి కృష్ణారెడ్డి, హరిబాబు ఆహ్వానం మేరకు నెల్లూరొచ్చానని తెలిపారు. విశాఖపట్నం, నెల్లూరు, తదితర ప్రాంతాల్లో చిత్ర నిర్మాణాలకు అద్భుతమైన లోకేషన్లు ఉన్నాయని వివరించారు. అనంతరం గౌతమ్‌రాజు దంపతులను సత్కరించారు.



గౌతమ్‌రాజు దంపతులకు సత్కారం

పురస్కార గ్రహీతలు..

అబ్బా టీవీ అధినేత హరిప్రసాద్, ఫన్ పార్క్ మేనేజింగ్ డైరెక్టర్ సాయి, నటుడు మల్లేశ్వరరావు, చిత్రకారుడు అమీర్‌జాన్, జాతీయ సేవా అవార్డు గ్రహీత రత్నం, స్టెప్ ఆఫ్ ఈవెంట్స్ నిర్వాహకుడు వెంకటరమణకుమార్, నృత్య గురువు విదుమౌళి, సంగీత విద్వాంసురాలు లక్ష్మీప్రసన్న, యాంకర్ స్వప్నారెడ్డి, కొరియాగ్రాఫర్ సురేష్‌కుమార్, జానపద కళాకారులు శ్రీనివాసులు, యానాదయ్యకు పురస్కారాలను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డాక్టర్ శ్రీనివాసరాజు, దేవరాల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్ల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగాలి



నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో వడ్డెర్ల సంక్షేమమే ధ్యేయంగా సంఘం పనిచేయాలని ప్రముఖ పారిశ్రామికవేత్త పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. వేదాయపాళెంలోని ఎమ్వీఎస్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశాన్ని జిల్లా వడ్డెర సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో వడ్డెర్ల కమ్యూనిటీ భవన్‌కు రూ.రెండు కోట్ల విలువ జేసే 200 అంకణాల స్థలాన్ని విరాళంగా అందజేస్తున్నానని ప్రకటించారు. నూతన భవన నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. రాష్ట్రంలో వడ్డెర్లకు రెండు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. భవిష్యత్తులో అన్ని రాజకీయ పార్టీలు తమకు ఎమ్మెల్యే టికెట్లను కేటాయించాలని కోరారు. అనంతరం వడ్డెర సంక్షేమ సంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా మహేష్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భాస్కర్, పెంచలయ్య, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, కోటకొండ వెంకటేశ్వర్లు, సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వెంకటేశ్వర్లు, కృష్ణ, సుధాకర్, గురవయ్య, యువత అధ్యక్షుడిగా పుష్పరాజ్, ప్రధాన కార్యదర్శిగా జితేంద్ర ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది కోటయ్య, సుబ్బారావు, చిన్నయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రోషన్, పద్మావతి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల రాజ్యస్థాపనకు కృషి చేయాలి

నెల్లూరు(వేదాయపాళెం): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కలలుగన్న బడుగు, బలహీన వర్గాల రాజ్యస్థాపన కోసం దళిత, గిరిజన సంఘాల నేతలు కృషి చేయాలని జై భీమ్ దేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నకేశవులు పిలుపునిచ్చారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో బడుగు, బలహీనవర్గాల రాజ్యస్థాపన సమావేశాన్ని జై భీమ్ దేశ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జై భీమ్ దేశ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఏఎస్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఛారువాక, పకీరప్ప, మాల మహానాడు రాష్ట్ర నేత జాన్‌బాబు, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు మాబూ, మహిళా నేతలు సుభాషిణి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నకేశవులు

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డైరీ ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డైరీ, పోస్టర్లను తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గిల్డ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభ్‌దాస్, సాల్మన్ మాట్లాడారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను జారీ చేయాలని కోరారు. అనంతరం వివిధ సమస్యలను ఎమ్మెల్సీకి తెలియజేశారు. వీటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

అలరించిన కవి సమ్మేళనం

నెల్లూరు(బృందావనం): శోభకృత్ నామ ఉగాది కవి సమ్మేళనాన్ని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని నెల్లూరు హాస్పిటల్ సమావేశ మందిరంలో పెన్నా రచయితల సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కవులు, రచయితలు చెంచులక్ష్మమ్మ, గురుమూర్తి స్మారక ఉగాది పురస్కారాలను సునీల్, రాము, నాగగాయత్రికి అందజేశారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌బాబు, సులోచన, రామచంద్రప్రసాద్, శివకుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాద వితరణ



నెల్లూరు(బృందావనం): పురమందిరంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దాదాపు రెండు వేల మందికిపైగా భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. కమిటీ శాశ్వత కార్యదర్శి నాగదేవీప్రసాద్, అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులు రామచంద్రమూర్తి, శ్రీనివాసమూర్తి, చంద్రమౌళి, సత్యనారాయణ, రామ్‌ప్రసాద్, కోశాధికారి నాగేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జునరావు, సహాయ కార్యదర్శులు సాయినాథ్, బలరామ్, తదితరులు పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో శనివారం అర్ధరాత్రి వీచిన ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 33 కేవీ లైన్ తెగిపోవడంతో వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డికాలనీ, డాక్టర్స్ కాలనీ, గాంధీగిరిజన కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో సిబ్బందిని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏఈ మధుసూదన్‌రెడ్డి, మన్మథరావు అప్రమత్తం చేశారు. తెల్లవారుజాము వరకు లైన్లకు మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని మున్సిపల్ పాఠశాలలో సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేస్తున్నారు. విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నేతలు నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను కోరారు. ఈ క్రమంలో అల్పాహారాన్ని అందజేసేలా ఎమ్మెల్యే చర్యలు చేపట్టారు. మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నేతలు లక్ష్మీనారాయణ, వెంగళరావు, సురేష్‌బాబు, ధనరాజ్, రవికుమార్, వీరభద్రుడు, తదితరులు కృతజ్ఞతలను తెలియజేశారు.



మూలస్థానేశ్వరాలయంలో 22న విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నామని ఈఓ వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూలస్థానేశ్వరుడికి మహారుద్రాభిషేకం, పూలంగిసేవను నిర్వహించనున్నామని చెప్పారు. అమ్మవారు శాకంబరిగా దర్శనమివ్వనున్నారని, కల్యాణ మహోత్సవం, పుష్పయాగాన్ని రాత్రి నిర్వహించనున్నామని తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.